సాక్షి జగిత్యాల

శుక్రవారం, 9, జూన్, 2023



మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు

రాయికల్: మండలంలోని తాట్లవాయి గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారికి గురువారం మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



తాగి నడిపితే జైలుకే

జిల్లావ్యాప్తంగా డ్రంకెన్‌డ్రైవ్‌పై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. నిత్యం వాహనాల తనిఖీతో పాటు మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.0/30.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

చెరువుల పండుగ బహిష్కరణ



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గంగపుత్రులు

వెల్గటూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని వెల్గటూర్ మండల మత్స్య కులస్తులు బహిష్కరించారు. నల్ల దుస్తులు, రిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 1064లో మత్స్య సహకార సంఘం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు సాంప్రదాయ మత్స్య కార్మికులైన బెస్త, గూండ్ల కులస్తులకే రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చారని అన్నారు., ఇప్పుడు ముదిరాజ్ కులానికి చెందిన వ్యక్తికి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ చెరువుల పండుగను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

సంబరాలు మాకొద్దు

- టెంట్ కూల్చివేసిన యువకులు



టెంట్ కూల్చి వేస్తున్న యువకులు

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువులు, కుంటల వద్ద సంబరాలు మాకొద్దంటూ గురువారం జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో చెరువు కట్ట వద్ద వేసిన టెంట్లను యువకులు కూల్చివేశారు. గ్రామానికి చెందిన గంగపుత్రులు, యువకులు ఆరు నెలల క్రితం అకాల వర్షానికి మత్తడి తెగి గండిపడగా ఇప్పటివరకు మరమ్మతు చేయించని ప్రభుత్వం సంబరాలు ఎందుకు నిర్వహించడమని ఆందోళన చేపట్టారు. వేసిన టెంట్లను తొలగించి మత్తడి నిర్మాణం తర్వాతే పండుగ చేసుకుందామని పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు.

సీఎంఆర్ చెల్లించాలి



మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల: సీఎంఆర్‌ను ఆగస్టు మాసంలోపు చెల్లించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. గురువారం బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వానాకాలం 2022–23 సంవత్సరానికి 3,38,000 మెట్రిక్ టన్నుల ధాన్యం రాబాయిల్డ్ రైస్‌మిల్లులకు కేటాయించడం జరిగిందని, ఇంకా మిల్లర్ల వద్ద 2.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 13 శాతం మాత్రమే సీఎంఆర్ చెల్లించారని, మిగితా 87 శాతం సీఎంఆర్ ఆగస్టు మాసం లోపు చెల్లించాలని సూచించారు. అలాగే వానాకాలం 2021–22కు సంబంధించి 38 రా, ఒక బాయిల్డ్ రైస్‌మిల్లర్లు డిఫాల్ట్ అయ్యారన్నారు. గడువులోపు పూర్తి చేయలేనందున మిగతా సీఎంఆర్ చెల్లింపులపై 125శాతం జరిమానా విధించారని, జరిమానా ఐదోవంతు డబ్బులు చెల్లించి మిగతా సీఎంఆర్ చెల్లింపులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ఓటరు జాబితాలో ఎలాంటి తప్పుడు లేకుండా చూసుకోవాలని ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు చేయాలని సూచించారు. గ్రామం విడిచి వెళ్లిన వారు, పెళ్లి చేసుకొని వెళ్లిన వారు, మృతి చెందిన వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పద్మ, ఆర్‌ఐలు రమేశ్, గంగాధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బెదిరింపులు.. వసూళ్లు!

రెండు నెలల క్రితం జగిత్యాలకు చెందిన ఓ న్యాయవాదికి ఎన్‌ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ) పేరిట బెదిరింపులు వచ్చాయి. ఫిర్యాదు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

20 రోజుల క్రితం బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో ఓ భవన నిర్మాణంలో నిబంధనలు సరిగా లేవనే విషయంలో నక్సల్స్ పేరిట బెదిరింపు ఉత్తరాలు వచ్చాయి. పోలీసులు విచారణచేసి నకిలీ లేఖలుగా గుర్తించి నిందితులపై కేసు నమోదు చేశారు.



10 రోజుల క్రితం కోరుట్ల మండలం అయిలాపూర్‌లో బెదిరింపులతో డబ్బులు సంపాదించాలనకుని రూ.లక్ష వెచ్చించి రివాల్వర్ కొనుగోలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

రెండు రోజుల క్రితం కోరుట్ల పట్టణంలోని ఓ వైద్యుడు భవన నిర్మాణం చేస్తుండగా డబ్బుల కోసం ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడటంతో.. వైద్యుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

15రోజుల క్రితం కోరుట్లలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి లేఅవుట్ అమలు చేయలేదన్న సాకు చూపి అధికారుల నుంచి ఒత్తిడి లేకుండా చూస్తానని చెప్పి ఓ ప్రజాప్రతినిధి సన్నిహితుడు రూ.6 లక్షలు తీసుకోగా, మున్సిపల్ అధికారులు హద్దురాళ్లు తొలగించడంతో వివాదాస్పదంగా మారినట్లు సమాచారం.

- మితిమీరుతున్న ఆగడాలు
- నిబంధనల సాకుగా దండుకుంటున్నారు..
- ఫిర్యాదులూ తక్కువే..

కోరుట్ల: జగిత్యాల జిల్లాలో కొంతమంది బెదిరింపులకు పాల్పడుతూ వసూళ్లు చేస్తున్న సంఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. నిబంధనలు సాకుగా చేసుకుని తప్పుడు పద్ధతుల్లో నిర్మాణాలు చేస్తున్నారని, ప్లాట్లు అమ్ముతున్నారని.. ఇవీ కాకుండా నక్సల్స్, చివరికి ఎన్‌ఐఏ పేరిట బెదిరింపులకు దిగుతున్న వైనం కలకలం రేపుతోంది. ఇలాంటి సంఘటనలు వరుసగా వెలుగులోకి వచ్చిన క్రమంలో లోలోపల ఇంకెన్ని ఆగడాలు చోటు చేసుకుంటున్నాయో అన్న అనుమానాలు వెంటాడుతున్నాయి.

నిబంధనలు సాకుగా..

సాధారణ వ్యాపారస్తులు, రియల్ వ్యాపారులు, వైద్యులు వంటి వైట్ కాలర్ వృత్తుల్లో ఉన్న వారికి బెదిరింపులు ఎక్కువగా వస్తున్నాయి. వీరిలో ఎక్కువ మంది పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ఆసక్తి చూపకపోవడం ఆగంతకులకు అవకాశంగా మారింది. ఫలితంగా భవన నిర్మాణాలు, లేఅవుట్ స్థలాలు, గౌరవప్రదమైన వృత్తి రంగా వచ్చే చిన్న చిన్న సమస్యలను అడ్డుపెట్టుకుని బ్లాక్ మెయిలర్లు తమ పబ్బం గడుపుకునేందుకు పథకం ప్రకారం బెదిరింపులకు దిగుతున్నారు. బుగ్గారం, కోరుట్లలో భవనాల నిర్మాణంలో ఉన్న లోపాలు, నిబంధనలు అమలు చేయడం లేదన్న సాకును చూపి మొదట అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత అధికారులు చర్యలు చేపట్టడం బాధితులు లోపాలు సరిదిద్దుకోవడం వంటి చర్యలతో ఆగంతకులు ఆశించిన రీతిలో డబ్బులు రావడం లేదు. ఫలితంగా అడ్డదారిలో డబ్బులు సంపాదించాలన్న ఆశతో బెదిరింపులకు దిగడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేశారు.

విచారణ కీలకం

- అధికారులు తమకు వచ్చిన ఫిర్యాదుల వెనుక పూర్వాపరాలు విచారించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.
- తమకు ఏదైనా ఓ అంశంపై ఫిర్యాదు అందగానే ఎవరు.. ఎందుకు ఫిర్యాదు చేశారు.. నిజంగానే నిబంధనల ఉల్లంఘన జరిగిందా? ఫిర్యాదుదారుడి స్వభావం, ఉద్దేశ్యం ఎలాంటిదన్న కోణంలో ఎలాంటి విచారణ చేయడం లేదు.
- చిన్నపాటి నిబంధనల అమలుల్లో నిర్లక్ష్యంపై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించకపోవడం బ్లాక్ మెయిలర్లకు కలిసోస్తుంది. దీంతో బాధితుల నుంచి డబ్బుల వసూలుకు మంచి అవకాశం చిక్కుతోంది.
- వృత్తులు, వ్యాపారాల్లో లోపాలు సాకుగా బెదిరింపులు, వసూళ్లకు దిగుతున్న ఆగంతకులకు గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు ఇచ్చి సరి పెడుతున్న కొంత మంది బాధితులు నిబంధనల అమలుకు అంత కన్నా తక్కువ ఖర్చు అవుతున్నా ఆ దిశలో ముందుకు వెళ్లడం లేదు.

ఫిర్యాదు వస్తే చర్యలు

బెదిరింపులకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తున్నాం. చాలా మంది తమకు ఎదురవుతున్న సమస్యలు బయటకు చెప్పుకోకపోవడం ఆగంతకులకు కలిసోస్తుంది. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలి. తప్పక చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

చేపల పెంపకంతో మత్స్యకారులకు ఆదాయం

- అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత



ఫుడ్ ఫెస్టివల్‌లో చేపల వంటకాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాలఅగ్రికల్చర్: చేపల పెంపకంతో మత్స్యకారులకు ఆదాయం లభిస్తుందని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జగిత్యాలలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో జిల్లాలో చేపల పెంపకం ఘననీయంగా పెరిగిందన్నారు. చేపలు పట్టి ఉపాధి పొందే గంగపుతురలు, ముదిరాజ్‌లకు ప్రభుత్వం సబ్సిడీపై మోపెడ్లు, వలలు, సేఫ్టీ జాకెట్లు, తెప్పలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి చెరువులో చేపలు, రొయ్యలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ మండు వేసవిలో సైతం చెరువులు నిండుకుండలా మారాయని తెలిపారు. చేపల ఆహారంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో 172 చెరువులను రూ.47 కోట్లతో పూడికతీసి నీటి లభ్యతను పెంచడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానంతోనే రాష్ట్రంలో నీలి విప్లవం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఫిషరీస్ చైర్మన్ గుమ్ముల అంజయ్య, కోరుట్ల వెటర్నరీ కాలేజ్ డీన్ మాధవవు, కౌన్సిలర్లు బొడ్ల జగదీశ్, అల్లె గంగసాగర్, మత్స్య సహకార సంఘ డైరెక్టర్లు అరుముల్ల పవన్ పాల్గొన్నారు.

మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శం



పెగడపల్లి చెరువు వద్ద పూజలు చేస్తున్న మంత్రి ఈశ్వర్

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి/బుగ్గారం/పెగడపల్లి: మిషన్ కాకతీయ పథకం దేశానికే ఆదర్శమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ధర్మపురి మండలం దమ్మన్నపేట, బుద్దేశ్‌పల్లి, పెగడపల్లి మండల కేంద్రం, బుగ్గారం మండలం వెల్గొండ, గోపులాపూర్ గ్రామాల్లో నిర్వహించిన చెరువుల పండుగలో పాల్గొని చెరువుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణాను సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. వ్యవసాయరంగంలో రైతాంగానికి నిరంతరం నీరందించడానికి మిషన్ కాకతీయ పథకం ప్రవేశపెట్టి చెరువులు, కుంటలు, కట్టల మరమ్మతులతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణంతో అద్భుత ఫలితాలు సాధించారని తెలిపారు. గత పాలకుల హయాంలో నిరాధారణకు గురైన చెరువులకు మిషన్ కాకతీయ ద్వారా రూ.25వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. దీంతో రైతులు, మత్స్యకారులకు జీవనోపాధి పెరిగిందని తెలిపారు. నాడు చేపలు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామన్నారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ మంద మకరంద, ఎస్పీ ఎగ్గడి భాస్కర్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీలు చిట్టిబాబు, రాజమణి, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు.

స్టాప్ ఇథనాల్-సేవ్ లైఫ్స్



స్తంభంపల్లిలో గ్రామస్తుల వినూత్న నిరసన

వెల్గటూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఊరూరా చెరువుల పండుగలో పాశిగామ, స్తంభంపల్లి గ్రామాల ప్రజలు వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. స్టాప్ ఇథనాల్-సేవ్ లైఫ్స్ పేరుతో ఉన్న నల్ల టీషర్టులు ధరించి ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రాణాలు హరించే పరిశ్రమ రద్దు చేయాలని కోరారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమను రద్దు చేస్తే అదే మాకు నిజమైన పండుగ అని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ఘనంగా సంబరాలు చేస్తుందని, కానీ వానాకాలం పంట వేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నా కూడా ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అలాగే ఉందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో రెండు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారం పునరుద్ధరించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: యువ పారిశ్రామికవేత్తగా రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తెస్తూ ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందుతున్నట్లు ప్రచారం చేసుకుంటున్న మంత్రి కేటీఆర్ జగిత్యాల జిల్లాలో ఉన్న ఏకైక వ్యవసాయదారిత చక్కెర పరిశ్రమను ఎందుకు పునరుద్ధరించడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు చక్కెర పరిశ్రమను పునరుద్ధరిస్తే కేటీఆర్‌కు క్షీరాభిషేకం చేస్తానని తెలిపారు. చక్కెర పరిశ్రమను పుణరుద్ధరించే వరకు మంత్రి కేటీఆర్ జిల్లాలో అడుగుపెట్టవద్దన్నారు. రుణమాఫీ అమలు చేయకుండా విందులు, వినోదాలతో రైతుల కన్నీళ్లు తుడవలేరని అన్నారు. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించకుండా చెరువు కట్టలపై విందులు, వినోదాలేంటని ప్రశ్నించారు. ప్రకటనలు, ఆర్భాటాలు, ఉత్తుత్తి సంబురాలతో రైతుల కడుపు నిండదని, వడ్డీతో సహా లక్ష రుణమాఫీ అమలు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. ఒక టీఎంసీ నీటి నిల్వకోసం 2015లో ప్రారంభించిన రోళ్లవాగు పునరుద్ధరణ పనులు ఇంకా పూర్తికాకపోవడం శోచనీయమన్నారు. రోళ్లవాగు పూర్తి చేయకుండా బీఆర్‌ఎస్‌కు రైతుల ఓట్లడిగే హక్కులేదని తెలిపారు. ధాన్యం సేకరణతో దగా పడుతున్న రైతులను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధర కంటి తుడుపు చర్యగా అభివర్ణించారు. పెరిగిన డీజిల్, ఎరువులు, కూలీల ధరలను పరిగణనలోకి తీసుకుని స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా పెట్టుబడికి అదనంగా 50శాతం మద్దతు ధర ఇవ్వాలని కోరారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ధాన్యానికి 2,500 మద్దతు ధర కల్పించి రైతన్నకు అండగా నిలుస్తామన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, మన్సూర్, గుండ మధు ఉన్నారు.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ ఆస్పత్రులు

- ధనార్జనే ధ్యేయంగా మల్టిస్పెషాలిటీ, క్రిటికల్ పేరిట ఏర్పాటు
- మధ్యవర్తులుగా ఆర్‌ఎంపీలు
- కొరవడిన వైద్య శాఖ నిఘా

ఇటీవల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల ఓ ఆస్పత్రిలో గొల్లపల్లి మండలం తిర్మలాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి 10 రోజుల పాటు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని బంధువులు ఆందోళన చేపట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సదరు డాక్టర్‌పై కేసు నమోదైంది.

గుల్లకోటకు చెందిన ఓ వ్యక్తి చేయి విరిగిందని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని పార్క్ సమీపంలోగల ఓ ఆస్పత్రికి రాగా, అతడికి అనిస్థీషియా ఎక్కువ ఇవ్వడంతో చనిపోయాడు. దీంతో బంధువులు తీవ్ర ఆందోళన చేయడంతో ఆస్పత్రివారు డబ్బు చెల్లించగా గొడవ సద్దుమణిగింది.

శ్రీరాములపల్లికి చెందిన ఓ వ్యక్తి జ్వరం వచ్చిందని జిల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్‌లో గల ఓ ఆస్పత్రిలో చేరగా కొద్దిరోజుల పాటు చికిత్స అందించారు. పల్స్ పూర్తిగా పడిపోవడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. మార్గమధ్యలోనే చనిపోవడంతో వైద్యుడి నిర్లక్ష్యమేనని ఆందోళన చేపట్టారు. ఇలా జగిత్యాలలో వారంలో రెండు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వైద్య శాఖ కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ప్రైవేటు ఆస్పత్రుల దోపకం అదుపులోకి రాని పరిస్థితి నెలకొంది.



జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రం కావడంతో వైద్యం వ్యాపారంగా మారింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చి మల్టీస్పెషాలిటీ, క్రిటికల్ కేర్, నర్సింగ్‌హోమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పేదల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. కొత్తగా ఆస్పత్రులు ఏర్పాటు చేసినవారు గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలను మచ్చిక చేసుకుని వారి ఆస్పత్రులకే పేషెంట్లను తీసుకువచ్చేలా నజరానా అందజేస్తున్నారు. చిన్నపాటి రోగానికి సైతం సిటీస్కాన్లు, ఎంఆర్‌ఐ స్కాన్ పరీక్షలు చేయిస్తూ ఇష్టానుసారంగా బిల్లులు వేస్తున్నారు. వైద్యశాఖ నిఘా లేకపోవడంతో వారు ఆడిందే ఆటగా మారింది.

వారానికి ఇద్దరు మృతి

అందమైన భవనాల్లో ఇష్టానుసారంగా ఆస్పత్రులు ఏర్పాటు చేసి ఎక్కడి నుంచో డాక్టర్లను తీసుకొచ్చి చికిత్సలు అందజేస్తున్నారు. ఆస్పత్రికి అనుమతి ఉందా? ఏ డాక్టర్ ఉన్నారు అన్నది కూడా ఎవరికీ తెలియదు. నూతనంగా వెలిసిన ఆస్పత్రుల్లో ఒకరు న్యూరలాజిస్టు అని, మరొకరు కార్డియాలజిస్ట్ అని, చెస్ట్ డాక్టర్ అంటూ రకరకాల వైద్యుల పేర్లు బోర్డులపై రాస్తున్నారు. అందులో ఏ డాక్టర్ ఉంటారో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి. ఇదంతా తెలియని అమాయక గ్రామీణ ప్రజలను ఆర్‌ఎంపీలు సంబంధిత ఆస్పత్రులకు తీసుకవచ్చి చికిత్స చేయిస్తున్నారు. వచ్చిన పేషెంట్ రోగమేంటి, పరిస్థితి ఏమిటి అన్నది ఆలోచించకుండా రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఉంచుతూ రకరకాల టెస్టులంటూ ఇబ్బందులు పెడుతున్నారు. ప్రజలు సైతం ఆ రోగాలు నిజమే కావచ్చని ఉన్నదంతా అమ్ముకుంటూ ఆస్పత్రికి చెల్లిస్తున్నారు. వైద్యం సక్రమంగా లేకపోవడంతో వారంలో దాదాపు ఇద్దరైనా మృతి చెందుతున్నారు. 10రోజుల పాటు ఆస్పత్రిలో ఉంచుకొని క్రిటికల్ కండీషన్ అంటూ కరీంనగర్, హైదరాబాద్‌లకు పంపిస్తున్నారు. ఆ సమయంలోనే ఆ వ్యక్తి మృతి చెందడం, ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమంటూ సదరు బంధువులు ఆస్పత్రుల ఎదుట ఆందోళనలకు దిగడం నిత్యం పరిపాటిగా మారింది. ఆస్పత్రులను ధ్వంసం కూడా చేస్తున్నారు. ఇటీవల ఎక్కువగా ఇలాంటి కేసులే జరుగుతుండగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఆస్పత్రులకు రక్షణ కల్పిస్తున్నారు.

మృతుల బంధువులతో బేరం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోవడంతో బంధువులు ఆందోళనకు దిగడంతో ఆస్పత్రి నిర్వాహకులు బేరానికి వస్తున్నారు. సదరు ఆస్పత్రికి ఎవరైతే తీసుకవచ్చారో ఆ పేషెంట్ మృతి చెందితే వారే మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారు. వారి మృతదేహానికి వెలకడుతున్నారు. రూ.3–4 లక్షలుచెల్లించడంతో గొడవలు సద్దుమణుగుతున్నాయి.

కొరవడిన నిఘా

నిబంధనల ప్రకారం ప్రతి ఆస్పత్రికి అనుమతి ఉండటంతోపాటు ఏ డాక్టర్ ఉన్నారు, ఎంతెంత ఫీజు తీసుకుంటున్నారో బోర్డులు ఉండాలి. ఏ డాక్టర్ పేరున రిజిస్ట్రేషన్ అయిందో ఆ డాక్టరే ఉండాలి. కానీ నిర్వాహకులు మొదట ఓ డాక్టర్‌ను తీసుకరావడం, ఆ డాక్టర్ మధ్యలోనే వెళ్లిపోవడంతో మరో డాక్టర్‌తో ఆస్పత్రిని కొనసాగిస్తున్నారు. డాక్టర్ మారినప్పుడు వైద్యశాఖకు దరఖాస్తు చేసుకోవాలి కానీ ఇవి ఎక్కడా అమలు కావడం లేదు. ఒక ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే దానికి సంబంధించిన అన్ని నిబంధనలు ఉండాలి. ఫైర్ సేఫ్టీ, రోగులు ఉండేందుకు అనువైన ప్రదేశాలు, కావాల్సిన వసతులు కల్పించాలి. కానీ జగిత్యాలలో చిన్న చిన్న గదుల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేస్తూ కొనసాగిస్తున్నారు. వైద్యాధికారులు మాత్రం ఎలా అనుమతిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వీటన్నింటిపై వైద్యాధికారుల నిఘా కొరవడటంతో ఇష్టారాజ్యంగా ప్రైవేటు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

కోరుట్ల: కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌కు చెందిన గీత కార్మికుడు తుమ్మల్ల పురుషోత్తం (42) గురువారం తాటిచెట్టు పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తం రోజూలాగే గురువారం తాటి చెట్టు ఎక్కి కల్లు తీసుకరావడానికి వెళ్లాడు. ఈక్రమంలో సాయంత్రం బలమైన ఈదురుగాలికి మోకు జారిపోవడంతో కిందికి జారి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన కరిగట్ల జమున(30) గురువారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కరిగట్ల జమునకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. మానసిక స్థితి బాగా లేకపోవడంతో ఆమె భర్త నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తన సోదరుడు గంగారాం వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. మానసిక స్థితి బాగా లేకపోవడం, అనారోగ్య సమస్యలు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామశివారులోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బావిలో దూకే సమయంలో అక్కడే ఉన్న పసుల లక్ష్మణ్ గమనించి గ్రామస్తులకు తెలపగా ఆమెను బావిలో నుంచి బయటకు తీశారు. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జమున సోదరుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దమ్మన్నపేటలో యువతి..

గొల్లపల్లి: గొల్లపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన జంగిలి మానస గురువారం అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. మానస కొంత కాలంగా కడుపునొప్పి, పిట్స్ వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో రైతు..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్‌కు చెందిన శ్యాగ చంద్రయ్య(58) గురువారం తన వ్యవసాయ క్షేత్రం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. శ్యాగ చంద్రయ్య తన చిన్న కూతురు వివాహానికి అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక బాధపడుతూ ఉండేవాడు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి లుంగీతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్యాగ లక్ష్మి ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కథలాపూర్: బీమారం మండలం కమ్మరిపేట గ్రామశివారులో గురువారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని కోటగిరి లింగయ్యకు చెందిన ఆవు గడ్డి మేసేందుకు గ్రామశివారులోకి వెళ్లింది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. రూ.1లక్ష నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపారు.

తాగి నడిపితే జైలుకే

- జిల్లాలో గతేడాది 8,619 మందిపై కేసులు
- ఈయేడు ఇప్పటివరకు 3,993 మందిపై..


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లావ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. నిత్యం వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ చేపట్టి మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నారు. 2021లో 4,270 మందిపై కేసులు నమోదు చేయగా, 2022లో 8,619 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే 11 మందిపై 304 సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈయేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 3,993 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా, అందులో ఆరుగురిపై 304 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

పరిహారం కోసం కఠిన నిర్ణయాలు

జిల్లా వ్యాప్తంగా చాలా మంది డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతుండటంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. వారు నడిపే వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో పాటు వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మద్యం తాగి వాహనం నడిపినట్లు నిర్ధారణ కావడంతో ప్రమాదంలో మరణించిన చాలా కుటుంబాలకు పరిహారం అందడం లేదు. దీంతో పాటు మద్యం తాగి వాహనాలు నడిపిన వారు ప్రమాదాలు ఎక్కువగా చేస్తుండటంతో ప్రమాదాల నివారణ కోసం పోలీసు శాఖ కఠినంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.

పట్టుపడిన చోటనే కేసు

పోలీసు శాఖ డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్నప్పుడు పట్టుబడిన వెంటనే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా పట్టుబడిన చోటనే ట్యాబ్ ద్వారా బ్రీతింగ్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు చేసి మద్యం తాగినట్లు తేలగానే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ కఠినతరం చేయడంతో చాలా మంది వాహనదారులు మద్యం తాగి వాహనం నడిపేందుకు జంకుతున్నారు.

నిబంధనలు కఠినతరం చేశాం



“ డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీలు చేపట్టాం. ఎంతటి వారైనా మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. శిక్షలు కూడా కఠినతరంగా ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే కఠిన నిర్ణయాలు తీసుకున్నాం. మద్యం తాగి ఎవరూ వాహనాలు నడపవద్దు.

– ఎగ్గడి భాస్కర్, జిల్లా ఎస్పీ

సాగునీటి రంగంలో రాష్ట్రం నంబర్‌వన్


గ్రామస్తులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న జెడ్పీచైర్‌పర్సన్, కలెక్టర్

– జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: సాగునీటి రంగంలో రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం సాయంత్రం ఊరూర చెరువుల పండుగ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపూర్‌లో కలెక్టర్ యాస్మిన్ బాషాతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో పాటు బోనాల పండగ నిర్వహించారు. రాష్ట్రంలో శిథిలావస్థలో ఉన్న చెరువులకు సీఎం కేసీఆర్ పూర్వ వైభవం తీసుకువచ్చారన్నారు. మండు వేసవిలో కూడా చెరువులు, కుంటల్లో పూర్తిస్థాయిలో నీరు ఉందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను అభివృద్ధి చేసి చెరువుల్లో నీటి మట్టం పెరిగేలా సీఎం కేసీఆర్ కృషి చేశారన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో పాటు రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్ట్‌ల నిర్మాణం పూర్తయి వాటి ఫలితాలతో వ్యవసాయ పంటల సాగు విస్తృతంగా పెరిగిందన్నారు. సాగునీరు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు. చెరువుల్లో నీటి నిలువలు పెరగడంతో మత్స్య సంపద కూడా పెరిగిందన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా గంగపుత్రుల జీవనోపాధి పెరిగిందన్నారు. అనంతరం చెరువుకట్టపై బతుకమ్మ ఆడి బోనాలు ఎత్తుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, డీపీవో దేవరాజం, ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ నవీన్, ఎంఈవో గాయత్రి, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

వ్యవసాయబావి ఒడ్డున మొసలి


బావి వద్ద కనిపించిన మొసలి

కథలాపూర్(వేములవాడ): మేడిపల్లి మండలం తొంబర్రావుపేట గ్రామశివారులో రైతు చిట్టిడి సతీశ్‌కు చెందిన వ్యవసాయబావి ఒడ్డున గురువారం మొసలి కనిపించింది. వెంటనే వ్యవసాయ బావిలోకి వెళ్లడంతో రైతులు భయాందోళనకు గురై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. బావిలో నీరు ఎక్కువగా ఉండటంతో మొసలిని పట్టుకునేందుకు కష్టంగా ఉందని, బావిలోని నీటిని విద్యుత్ మోటార్‌తో తొలగిస్తున్నట్లు రైతులు తెలిపారు.

రెండు ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్లు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం కలిగోడ గ్రామశివారులోని అటవీ భూములను దున్నుతున్న రెండు ట్రాక్టర్‌లను గురువారం పట్టుకొని సీజ్ చేసినట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మల్లేశం, బీట్ ఆఫీసర్ రఫీ నయీం తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు అటవీశాఖ అధికారులు వివరించారు.

ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఉపసర్పంచ్, గ్రామస్తులు

మానకొండూర్ రూరల్: మండలంలోని వేగురుపల్లిలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాం రాజయ్యపై చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్ మందల మల్లారెడ్డి, గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలలో విధులు సక్రమంగా నిర్వహించకుండా గ్రామంలోని అనవసర విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాడని ఆరోపించారు. విద్యార్థులను కఠినంగా దండించడంతో పాఠశాలకు రావాలంటే భయపడుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. అధికారులు వెంటనే అతడిని విధుల్లోంచి తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం


శివ మారుతి రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

కోరుట్ల రూరల్: సివిల్స్‌లో ఆలిండియా 132 ర్యాంక్ సాధించిన అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివమారుతిరెడ్డిని గురువారం స్వేచ్ఛా, సాహిత్య, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాస భూమయ్య, రుద్ర నాగరాజు, వెంకట నర్సయ్య, రాసబత్తుల రాజశేఖర్, శ్యాంసుందర్, మ్యాదరి మారుతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన పల్లె మహేందర్ రెడ్డి ద్విచక్రవాహనంపై పొలం నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టడంతో శ్రీనివాస్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. యజమాని కారుతో పరారీ కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ రెడ్డికి ఈఎంటీ సతీశ్ రెడ్డి ప్రథమ చికిత్స అందించి 108లో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలంలో కారు నంబర్ ప్లేట్ పడిపోవడంతో పోలీసులు కారు యజమాని అడ్రస్ కనుక్కున్నారు.

వివాహం అడ్డగింత

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గంగిరెద్దుల కాలనీలో ఓ మైనర్ యువకుడి వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లో వెళ్తే.. గ్రామానికి చెందిన ఓ యువకుడికి (19) అల్గునూర్‌కు చెందిన అమ్మాయి (21)తో గురువారం వివాహం జరుగనుంది. గ్రామస్తుల సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు చేరుకొని వివాహాన్ని అడ్డుకున్నారు. అమ్మాయి మేజర్ కాగా అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకపోవడంతో వివాహాన్ని నిలిపివేయాలని వారు సూచించారు. వీరి వివాహంతో పాటు మరో పెళ్లి కూడా ఆగిపోయింది. కుండమార్పిడి (ఇటు అమ్మాయి అటువైపు, అటు అమ్మాయి ఇటు వైపు) వివాహం కూడా నిలిచిపోయింది. ఐసీపీఎస్ శాంత, ఏసీడీపీఓ అరవింద, ఆర్ఐ శైలజ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజశ్రీ, ఇందిర, పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): జమ్మికుంట మండలం నగురం గ్రామానికి చెందిన పొల్సాని తిరుపతి రావు తన ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండగా విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించగా పట్టుబడ్డాడు. కరీంనగర్ విజిలెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి మొదటి నేరం కింద రూ.వెయ్యి జరిమానా విధించి వదిలిపెట్టారు. మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ రెండోసారి పట్టుబడగా కేసు నమోదు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి ఎదుట విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో తిరుపతిరావుకు రూ.2,340 జరిమానా లేదా రెండునెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయనవెంట ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేశ్, సిబ్బంది ఉన్నారు.

కేసీఆర్ దూరదృష్టితో రాష్ట్రం సుభిక్షం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

కొండగట్టు(చొప్పదండి): సీఎం కేసీఆర్ దూరదృష్టితో రాష్ట్రంలో పుష్కలంగా నీటి వసతులు కలిగాయని, దీంతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కొడిమ్యాల మండలం కొండాపూర్‌లోని మైసమ్మ చెరువు వద్ద నిర్వహించిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు, పామూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ సహా అనేక ప్రాజెక్టులను నిర్మించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పంటలు పుష్కలంగా పండుతున్నాయని అన్నారు. వరిధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ఊరురా చెరువుల్లో సమృద్ధిగా నీటి లభ్యత పెరిగిందని, వేసవి కాలంలో 44వేల చెరువులు, కుంటలు మత్తడి పారుతున్నాయని అన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి కరువు కటాకాలు వచ్చిన భూగర్భ జలాలు గణనీయంగా పెరగడం వల్ల రాష్ట్రానికి డోకా లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు సర్పంచ్ ప్రభాకర్, ఎంపీపీ మేనేని స్వర్ణలత రాజనర్సింగ రావు, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, కృష్ణారావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వే విద్యుత్ వైర్ల చోరీ ముఠా పట్టివేత


పట్టుబడిన ముఠా సభ్యులతో బ్లూకోల్ట్స్ సిబ్బంది

జగిత్యాలక్రైం: కొంతకాలంగా జిల్లాలో రైల్వే ట్రాక్ వెంట ఉన్న విద్యుత్ వైర్లు దొంగిలిస్తున్న ముఠాను బ్లూకోల్ట్స్ సిబ్బంది పట్టుకొని రైల్వే పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల రూ.10లక్షల విలువైన రైల్వే లైన్ విద్యుత్ రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. మల్యాల–నూకపల్లి మధ్య బుధవారం అర్ధరాత్రి ముగ్గురు రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా ఏడుగురు దొంగలు విద్యుత్ వైర్లు చోరీ చేస్తూ కనిపించారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా వారిపై రాళ్లు రువ్వి పారిపోయారు. దీంతో రైల్వేపోలీసులు డయల్ 100కు కాల్ చేసి మల్యాల బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాజారం వైపు వెళ్తున్న గోదావరిఖనికి చెందిన ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారి డ్రెస్‌లు, చేతులను క్షుణ్ణంగా పరిశీలించడంతో వారే దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆ నిందితులను రైల్వే పోలీసులకు అప్పగించారు. ఈ ముఠాను పూర్తిస్థాయిలో విచారిస్తే అసలు నిజాలు వెలుగుచూడనున్నాయి.

భారత్ బచావో సదస్సు విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయికల్/కథలాపూర్: భారత రాజ్యాంగాన్ని సమూలంగా నిర్వీర్యం చేసి మనుస్మృతిని మళ్లీ దేశంలో కొనసాగించాలని కుట్ర చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 10న జగిత్యాలలో నిర్వహించే భారత్ బచావో సదస్సును విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. గురువారం రాయికల్ మండలం మైతాపూర్, రాయికల్, బీమారం మండలం దేశాయిపేటలో పలు సంఘాల నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో భారత్ బచావో జిల్లా కోఆర్డినేటర్ నారాయణ, సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, హుస్సేన్, మైతాపూర్ సర్పంచులు అజారొద్దీన్, రాజేందర్, నాయకులు ప్రకాశ్, సామల్ల ప్రసాద్, రాజేందర్ పిట్టల నారాయణ, ఎండీ షేక్‌హుస్సేన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


రాఘవపేటలో ఢీకొన్న కారు, ద్విచక్రవాహనం


తీవ్రంగా గాయపడ్డ అనిల్, రాహుల్

మల్లాపూర్: మల్లాపూర్ మండలం రాఘవపేట శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిలిపేట గ్రామానికి చెందిన బనావత్ దేవదాస్ కారులో స్వగ్రామానికి వెళ్తుండగా, రాజస్తాన్‌కి చెందిన ఇద్దరు కూలీలు అనిల్, రాహుల్‌లు ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి పట్టణానికి వస్తున్నారు. ఈ క్రమంలో రాఘవపేట శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో మూలమలుపు వద్ద ఎదురెదురుగా కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న అనిల్, రాహుల్‌లు తీవ్రంగా గాయపడగా, స్థానికులు మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మల్లాపూర్ పోలీసులు ఘటనస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

గంగాధర: డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని ఒద్యారం గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం... రామడుగు మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన నిమ్మనవేణి శ్రీనివాస్ (40) భార్య మంజు, కూతురు సౌజన్యతో కలిసి బుధవారం వేములవాడ మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అత్త లక్ష్మీ అక్కడికి రాగా గురువారం తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై దింపేందుకు శ్రీనివాస్ ఎలగందల గ్రామానికి వెళ్లాడు. తిరిగి కోనాయిపల్లికి వెళ్తుండగా ఒద్యారం గ్రామ శివారులోని ఎస్వీజీ గ్రానైట్ క్వారీ సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించాడు.

చిన్నారిని ఆదుకోండి

- గుండెకు రంధ్రాలు
- ఆపరేషన్‌కు రూ.3లక్షలు కావాలి
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపులు


చికిత్స పొందుతున్న చిన్నారి

వేములవాడరూరల్: చిన్నగుండెకు రంధ్రాలు ఉన్నాయి. ఆ గుండె నిబ్బరంగా కొట్టుకోవాలంటే ఆపరేషన్ అవసరం. చిన్నిగుండెకు శస్త్రచికిత్సకు రూ.3లక్షలు వెచ్చించే పరిస్థితుల్లో ఆ నిరుపేద తల్లిదండ్రులు లేరు. దాతలు సాయం చేసి తమ బిడ్డను కాపాడాలని కోరుతున్నారు.

గుండెకు రంధ్రాలు

వేములవాడ మండలంలోని హన్మాజిపేటకు చెందిన సూర మహేశ్–కొమురవ్వ దంపతులకు మూడు నెలల క్రితం కుమారుడు జన్మించాడు. బాబు ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో ఆస్పత్రిలో చూపించారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి గుండెకు రంధ్రాలు ఉన్నట్లు గుర్తించారు. రెండు నెలల నుంచి ఇప్పటి వరకు రూ.3 లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించారు. అయినా ఆరోగ్యం కుదుట పడలేదు. ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు చెప్పినట్లు ఆ తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆపరేషన్ చేయించే ఆర్థిక స్థోమత లేక ఆ తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు సాయం చేయాల్సిన నంబర్

సూర మహేశ్, ఖాతా నంబర్ : 38312005175
ఎస్‌బీఐ, వేములవాడ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ :
ఎస్‌బీఐఎన్0017241